నాటకంతో నవసమాజం

- ఎన్నో సంఘ సంస్కరణలకు వేదిక
- నేడు కందుకూరి జయంతి సందర్భంగా నాటకరంగ దినోత్సవం


నవరస ప్రదర్శించిన సుందరీ సుబ్బారావు నాటికలో ఒక సన్నివేశం


శ్రీవేంకటేశ్వర వైభవం నాటకంలో సన్నివేశం

కాకినాడ కల్చరల్: సమజాన్ని జాగృతం చేసే శక్తివంతమైన కళారూపం నాటకం. ఎన్నో సంఘ సంస్కరణలకు నాటి సామాజిక మాధ్యమం నాటకమే అనడంలో అతిశయోక్తి లేదు. ఆ నాటకం ద్వారా ఎంతో మంది సంఘ సంస్కర్తలు ఎన్నో దురాచారాలను తరిమికొట్టారు. వారిలో నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం ఒకరు. 1880లో వ్యవహార ధర్మబోధిని నాటకం ద్వారా నాటి ఆంగ్లపాలకుల ఆరాచకాలను ఎత్తిచూపి సమాజాన్ని జాగృతం చేసిన ధీరోదాత్తుడు ఆయన. కందుకూరి 175వ జయంతి ఏప్రిల్ 16ను తెలుగు నాటకరంగ దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. నాటక పరిషత్‌ల కృషితో నాటక రంగానికి ఎంతో ఆదరణ పెరిగింది. ఈ ఆదరణ వెనుక కందుకూరి కృషి ఎంతో ఉంది. కాకినాడలో ఉన్న నాటక పరిషత్‌లు, నాటకరంగ సంస్థలు కళలను ప్రొత్సహించడమే కాకుండా ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ నాటకరంగానికి జీవం పోస్తున్నాయి. నగరంలో సీతారామరాజు స్మారక కళావేదిక చిన్నారులను నాటకరంగంలో ఎంతో ప్రోత్సహిస్తోంది. ఇక సాంఘిక నాటకాలకు పంతం పద్మనాభం స్మారక పరిషత్ పెట్టింది పేరు. అలాగే నటీనట వర్ధమాన రంగస్థల సమాఖ్య స్వర్గీయ ఎస్ఎస్ఆర్‌కే గురుప్రసాద్ స్థాపించి 'సుందరీసుబ్బరావు' హాస్య నాటిక ద్వారా ఎంతో పేరు సాధించారు. అలాగే మూర్తి కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకులు కె.మూర్తి నైతిక విలువలకు అద్దం పట్టే నాటికలు ప్రదర్శించి సమాజంలో మార్పు కోసం ఆయన వంతు కృషి చేస్తున్నారు. వర్ధమాన నటులను తీర్చిదిద్దుతూ కళామాతల్లి రుణం తీర్చుకొంటున్నారు. నాటకరంగానికి జీవం పోయాలనే తపనతో ఎన్నో నాటకరంగ సంస్థలు నిరంతరం ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహిస్తూ సమాజోద్ధరణకు కృషి చేస్తున్నారు.

యువతకు నాటకాలపై అవగాహన



యువతకు నాటకాలపై అవగాహన పెంచే ప్రయత్నం చేస్తున్నాం. ఇది కాలానుగుణంగా జరగకపోతే నాటకం అనేది తెరమరుగయ్యే ప్రమాదం ఉంది. నాటకరంగం మన వారసత్వ సంపదగా యువత భావించాలి.

– పంపన దయానందబాబు, వ్యవస్థాపక కార్యదర్శి, సీతారామరాజు స్మారక కళావేదిక, కాకినాడ

ప్రజలను ఆలోచింప చేస్తాయి



నాటకాలు ప్రజలను ఆలోచింపజేస్తాయి. సమాజాన్ని ప్రభావితం చేసే గొప్ప శక్తి నాటక రంగానికి మాత్రమే ఉంది. మంచి, చెడులను నాటకం ద్వారా ప్రదర్శించి చివరకు మంచికే న్యాయం జరుగుతోందనే భావన నాటకరంగం కల్పిస్తుంది. సమాజంలో జరిగే ఇతివృత్తాలనే ఆధారం చేసుకొని నాటికలు ప్రదర్శిస్తారు. ఇవి ప్రజలను ఆకట్టుకుని ఆలోచింపజేస్తాయి. తద్వారా సమాజం నైతికత వైపు అడుగులు వేస్తుంది.

– తురగా సూర్యారావు, రంగస్థల నటుడు

నేడు తెలుగు నాటక దినోత్సవం

కాకినాడ కల్చరల్: స్థానిక విశ్రాంత ఉద్యోగుల భవనం సమావేశ మందిరంలో సీతారామరాజు స్మారక పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం తెలుగు నాటక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు వేదిక వ్యవస్థాపక కార్యదర్శి పంపన దయానంద బాబు తెలిపారు. ఏటా సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం జయంతిని తెలుగు నాటక దినోత్సవంగా జరుపుకొంటామని తెలిపారు. ఈ సందర్భంగా నాటక రంగంలో విశిష్ట సేవలు అందజేసిన ప్రముఖులకు కందుకూరి పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి ముందు స్మారక కళావేదిక 39 వ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సభ్యులు అందరూ హాజరు కావాలని పంపన కోరారు.

వ్యాయామంతో గర్భాశయ సమస్యలకు చెక్

బోట్‌క్లబ్: మహిళల్లో ఎక్కువగా వచ్చే గర్భాశయ సమస్యలను గుర్తించి చికిత్స అందిస్తే సరిపోతుందని వారు భయపడాల్సిన అవసరం లేని ప్రముఖ స్త్రీల వ్యాధుల నిపుణురాలు దేవి స్వప్నిక అన్నారు. స్థానిక జగన్నాథపురం గోగుదాన య్యపేటలోని రోటరీ కమ్యూనిటీ సెంటర్‌లో రోటరీ క్లబ్ కాకినాడ ఆధ్వర్యంలో శనివారం మహిళలకు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నపాటి వ్యాయామాల ద్వారా ఈ వ్యాధిని అదుపులో ఉంచవచ్చునన్నారు. క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద, సెక్రటరీ కోనాడ ప్రకాశరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.4.2 లక్షలతో చెరువు అభివృద్ధి


వేళంగిలోని రజక చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

కరప: మండలం వేళంగిలోని రజక చెరువును రూ.4.2 లక్షల ఉపాధి నిధులతో పూడిక తీయించి అభివృద్ధి చేయిస్తున్నట్టు ఏపీఓ ఈ.వెంకటరమణ తెలిపారు. శనివారం ఆయన ఉపాధిపనులు పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామంలోని ఉపాధి కూలీలందరికీ పని కల్పించాలని, నిర్దేశించిన కొలతల ప్రకారం పనిచేయించి, ఎప్పటికప్పుడు మస్టర్లు వేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ ఐ.కుమారస్వామికి, పనులు పర్యవేక్షించాలని జేఈ వై.నాగలోవకు సూచించారు. ప్రతిరోజూ 150 మంది ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని, శనివారం 142 మంది వచ్చారన్నారు. చెరువు పూడికతీతకు కూలీలకు 1,800 పనిదినాలు కల్పించినట్టు తెలిపారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కరప: గ్రామాభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని గ్రామ కార్యదర్శి వి.సునీల్‌కుమార్ కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రామసభలో వివిధ శాఖల అభివృద్ధి పనులను ఆయన వివరించారు. సభకు అధ్యక్షత వహించిన సర్పంచ్ సాదే ఆశాజ్యోతి మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరాకు సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గ్రామంలో చేయాల్సిన పనులపై చర్చించి, తీర్మానాలు చేశారు. శివారు పేపకాయలపాలెం, రామకంచిరాజునగర్ కాలనీలను పైలట్‌ప్రాజెక్టుగా చేశామని తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్ వాసంశెట్టి రాము ఉపాధి పనుల గురించి వివరించారు. సచివాలయ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు. గొడ్డటిపాలెం, పాతర్లగడ్డ, గొర్రిపూడి, ఉప్పలంక, జి.భావరం, కూరాడ గ్రామాల్లో కూడా గ్రామసభలు నిర్వహించారు.

నిందితుడికి రిమాండ్

కరప: ప్రేమపేరుతో వేధిస్తున్నాడని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోక్సో కేసులో అరెస్టయిన నిందిడుకి రిమాండ్ విధించినట్టు ఎస్ఐ నౌడు రామకృష్ణ తెలిపారు. వేములవాడకు చెందిన ఒక యువతి కాకినాడలో పాలిటెక్నిక్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన జంగా సతీష్ ఆమెను వేధిస్తున్న క్రమంలో గత నెల 29న ఆమె స్నానం చేస్తుండగా ఫొటోలు తీసి పరారై పోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అతడిపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. ఈ మేరకు 14 రోజుల రిమాండ్ విధించినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ట్రాన్స్‌జెండర్స్ డే


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ట్రాన్స్‌జెండర్లు

కాకినాడ క్రైం: సర్పవరం కూడలిలోని ది వలంటరీ హెల్త్ సర్వీసెస్ కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ, విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్స్‌డే ఘనంగా జరిగింది. సెంటర్ నిర్వాహకులు కావ్య, మైథిలి, సునీత పర్యవేక్షణలో ఏడీ వాగ్దేవు కామరాజు, డీఏపీసీయూ డీఎస్ బుజ్జిబాబు మాట్లాడుతూ టీజీలకు తగిన రీతిలో ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఇళ్లు, ఫించన్లు, ఇతర అంశాలపై తమను సంప్రదించాలని కోరారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఈ.గౌరీశేఖర్ టీజీలకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. అనంతరం అధికారులతో కలసి కేక్ కట్ చేశారు. నగరానికి చెందిన సుమారు 70 మంది ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

ఏడుగురికి కోవిడ్ పాజిటివ్

కాకినాడ క్రైం: జిల్లాలో శనివారం ఏడుగురికి కోవిడ్ పాజిటివ్ నిర్ధారణ అయింది. శుక్రవారం సేకరించిన 113 నమూనాలను పరిశీలించగా ఈ ఫలితం వెలువడింది. శనివారానికి జిల్లాలో 42 క్రియాశీలక కోవిడ్ కేసులు ఉన్నాయి.

జనసేన నాయకుల పర్యటన

కరప: మండలం పెద్దాపురప్పాడు, విజయరాయుడుపాలెం గ్రామాల్లో శనివారం జనసేన పార్టీ పీఏసీ సభ్యుడు పంతం నానాజీ పార్టీ నాయకులు జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పాదయాత్ర చేసి, ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మండలపార్టీ అధ్యక్షుడు బండారు మురళి, భోగిరెడ్డి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూ.14.95 కోట్లతో జల్‌జీవన్ పనులు


అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అధికారులను ఆదేశించారు. రూరల్ మండలం నేమాం, పండూరు, తిమ్మాపురం, సూర్యారావు పేట జగనన్న హౌసింగ్ లే-అవుట్‌లో జల్‌జీవన్ మిషన్ పథకంలో శాశ్వతంగా తాగునీటిని అందించడానికి 14.95 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయన్నారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. రూరల్, కరప మండలాల్లో జల్‌జీవన్ మిషన్‌లో జరుగుతున్న పనులపై ఆయన గ్రామీణ నీటి సరఫరా అధికారులతో సమీక్షిస్తూ నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలను గుర్తించి ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని, తూరంగి సీపీడబ్ల్యూఎస్ అభివృద్ధి చేసేందుకు రూ.10 లక్షలు సీఎండీఎఫ్ నిధులు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, ఈఈ కేవీవీ చౌదరి, డిప్యూటీ ఈఈ కె.శ్రీదేవి, ఏఈ బీవీ మారుతీరామ్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో పనులు వేగవంతం చేయండి

- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్
- అధికారులతో సమీక్ష సమావేశం


ఇళ్ల నిర్మాణ ప్రగతిని, వసతులను అధికారులను అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ మహేష్‌కుమార్

కాకినాడ: టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేలా సత్వర చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్ రవిరాల అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక టిడ్కో ఇళ్ల సముదాయాన్ని సందర్శించి ఇళ్ల ప్రగతి, వసతులు, పెండింగ్ పనులను అడిగి తెలుసుకున్నారు. 2056 ఇళ్లకు మొదటి విడత 1152 ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు కమిషనర్‌కు వివరించారు. అనంతరం కమిషనర్ చొల్లంగి లే అవుట్‌ను సందర్శించారు.

అధికారులతో సమీక్ష

అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో కమిషనర్ మెప్మా, నగరపాలక సంస్థ, రిజిస్ట్రేషన్, టిడ్కో, విద్యుత్, విభాగాల అధికారులతో సమావేశమై పంపిణీకి సిద్ధంగా ఉన్న 1152 ఇళ్లకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. 119 మంది లబ్ధిదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న బ్యాంకు లింకేజీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా రిజిస్ట్రార్ రామలక్ష్మి పట్నాయక్, టీపీఆర్వో మానే కృష్ణమోహన్ తదితర అధికారులు పాల్గొన్నారు.

కాకినాడలో మెగా రక్తదాన శిబిరం


రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: ఉమ్మడి జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాకినాడ జిల్లా వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు దుగ్గన నాగరాజు (బాబ్జీ) పుట్టినరోజు సందర్భంగా శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జగన్నాథపురం నూకాలమ్మ ఆలయం సమీపంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ప్రారంభించారు. మాజీ మంత్రి, రూరల్ ఎమ్మెల్యే కన్నబాబుతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. పెద్ద ఎత్తున కార్మికులు, నాయకులు, కార్యకర్తలు హాజరై రక్తదానం చేశారు. శ్రీయువసేన బ్లడ్ బ్యాంక్ అధ్యక్షుడు బి.సతీష్ సహకారంతో దాదాపు 330 మంది రక్తదానం చేశారు. ఎంపీ, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ ఆడంబరాలకు దూరంగా పది మందికి ప్రాణదానం చేసే రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమని దుగ్గన బాబ్జీని అభినందించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు మీసాల దుర్గాప్రసాద్, ఎంజీకే కిశోర్, మీసాల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణకు చురుగ్గా ఏర్పాట్లు

- డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్


సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్

నాగమల్లితోట జంక్షన్: కాకినాడ జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మే 1 నుంచి 31 వరకు వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎస్ఏ చీఫ్ కోచ్ శ్రీనివాస్ కుమార్ తెలిపారు. శనివారం క్రీడా మైదానంలోని డీఎస్ఏ కార్యాలయంలో వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది 22 క్రీడాంశాల్లో అర్బన్, రూరల్ పరిధిలో 50 శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరాలకు అవసరమైన క్రీడా సామగ్రిని కూడా అందజేస్తామన్నారు. పీఈటీ సంఘ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ఎల్.జార్జి, రవిరాజు, సీనియర్ పీడీలు బంగారాజు, రంగారావు, శాయ్ విశ్రాంత అథ్లెటిక్ కోచ్ కొండలరావు, డీఎస్ఏ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ సతీష్ కుమార్ శిబిరాలు విజయవంతంగా నిర్వహించేందుకు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సమావేశంలో వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలసిన రెవెన్యూ సంఘం నేత

కాకినాడ సిటీ: రెవెన్యూ శాఖ టైపిస్ట్ కం కంప్యూటర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన కాకినాడ జిల్లాకు చెందిన జ్యోతుల సూరిబాబు, అసోసియేషన్ నాయకులు శనివారం కలెక్టర్ కృతికా శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి నెల సక్రమంగా జీతాలు వచ్చేలా చేసి, ఉద్యోగ భద్రత కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటామని పేర్కొన్నారు. అమరావతి జేఏసీ పేరుతో చేస్తున్న ఉద్యమాల్లో తాము పాల్గొనడం లేదన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ తదితరులు ఉన్నారు.


కలెక్టర్ కృతికా శుక్లాను కలసిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జ్యోతుల సూరిబాబు

వలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

కరప: మండల పరిధిలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టుల భర్తీకి శనివారం నోటిఫికేషన్ విడుదల చేస్తారని, అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కర్రె స్వప్న శుక్రవారం తెలిపారు. కరప, పెనుగుదురు, గురజనాపల్లి, కొంగోడు, వేళంగి గ్రామాలకు ఒక్కొక్క పోస్టు ఖాళీ ఉందన్నారు. సోమవారం నుంచి 19వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. 20న పరిశీలన, 21న ఇంటర్వ్యూ, 24న ఇంటిమేషన్ లెటర్ అందజేత, 25న శిక్షణ ఇచ్చి, 26న పోస్టింగ్ ఇవ్వడం జరుగుతుందని ఎంపీడీఓ తెలిపారు.

ఆపద మిత్రలకు కిట్ల పంపిణీ


ఆపద మిత్రలకు కిట్లు అందజేస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: ఆపద మిత్ర శిక్షణ పూర్తి చేసుకున్న వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు శనివారం కలెక్టర్ కృతికా శుక్లా గుర్తింపు కార్డులు, కిట్లు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ విపత్తుల సమయంలో ప్రజలకు అండగా సేవలు అందించాలని సూచించారు. కాకినాడ జిల్లా నుంచి 150 మంది సామర్లకోటలోని విస్తరణ శిక్షన కేంద్రంలో ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్ ఆధ్వర్యంలో 12 రోజుల పాటు శిక్షణ అందించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక, రెడ్‌క్రాస్ తదితర విభాగాలతో పాటు రెవెన్యూ, పోలీస్ తదితర సమన్వయ శాఖల భాగస్వామ్యంతో ఆపద మిత్ర శిక్షణ ఇచ్చారు. డీపీఎం కిరణ్మయి, ట్రైనింగ్ సెంటర్ ఫ్యాకల్టీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా 'జగనన్నే మా భవిష్యత్'


సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు కిట్లు అందజేస్తున్న దృశ్యం

కాకినాడ: 'జగనన్నే మా భవిష్యత్' శనివారం సందడిగా సాగింది. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న రెవెన్యూకాలనీ, సాంబమూర్తినగర్ ప్రాంతాల్లో పర్యటించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి జగన్నాథపురంలోని నేతాజీ పార్క్, కేశవవారివీధి, మున్సబుగారి వీధి ప్రాంతాల్లో, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ రామారావుపేట, గాంధీనగర్ ప్రాంతాల్లో పర్యటించారు.

వసతిగృహం తనిఖీ

కాకినాడ లీగల్: కాకినాడ జగన్నాథపురంలోని సోషల్ వెల్ఫేర్ మహిళా కళాశాల వసతిగృహాలను మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ పి.కమలాదేవి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి వసతులను పరిశీలించారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి జి.జాన్‌బాబు, వసతి గృహ అధికారి బి.వనజాక్షి, వన్‌టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

వైభవంగా సీతారామ కల్యాణం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

బోట్‌క్లబ్: స్థానిక జగన్నాథపురం నెల్లి అప్పారావు సెంటర్ సచ్చినాంద ఆశ్రమంలోని రామాలయంలో ఉద్దగిరి సుబ్బారావు రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో శనివారం సీతారాముల కల్యాణం నిర్వహించారు. ఆలయంలో నూతన ధ్వజ స్తంభం నిర్మాణానికి సాయం చేయాలని కోరగా అవోగా సంస్థ రూ.72 వేలను కమిటీ సభ్యురాలు మీనాకుమారికి విరాళంగా అందజేశారు. స్తంభం నిర్మాణానికి అవసరమైన ఇత్తడిని కూడా అందజేశారు. కనుమూరి రాజ్యలక్ష్మి, మాటూరి అనురాధ, ప్రగల్లపాటి కనకరాజు, సీహెచ్ మాధవరావు, రామచంద్రరావు పాల్గొన్నారు.

స్నేహబంధానికి ప్రతీక ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి తదితరులు

కాకినాడ: కాకినాడ పోలీస్ రిజర్వులైన్‌లోని మస్జిద్-ఎ-షషరీఫైన్‌లో శనివారం జరిగిన ఇఫ్తార్ విందుకు ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హాజరయ్యారు. ఎంపీ గీత మాట్లాడుతూ రంజాన్ మాసంలో జరిగే ఇఫ్తార్ విందులు సర్వమత సమానత్వానికి, ధాతృత్వానికి, స్నేహభావానికి ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఎమ్మెల్యే ద్వారంపూడి మాట్లాడుతూ ముస్లిం మైనార్టీల సంక్షేమం కోసం సీఎం జగన్ ఎన్నో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందిస్తున్నారని, వీరంతా సీఎంకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, పార్టీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మైనార్టీ సెల్ ప్రాంతీయ పరిశీలకులు అబ్దుల్ బషీరుద్దీన్, మసీదు అధ్యక్షుడు మస్తాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బాషా తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆవశ్యకతపై అవగాహన


భూసార పరీక్షలు-ఉపయోగాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు

కాకినాడ రూరల్: మండలం గంగనాపల్లి ఆర్బీకేలో భూసార పరీక్షలు, వాటి ఆవశ్యకతపై మండలంలోని 13 ఆర్బీకేల గ్రామ వ్యవసాయ సహాయకులకు, గ్రామ ఉద్యానవన సహాయకులకు శనివారం శిక్షణ ఇచ్చారు. మండల వ్యవసాయాధికారి చీకట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కాకినాడ వ్యవసాయ అధికారి జీవీ పద్మశ్రీ పాల్గొని భూసార పరీక్షల ఆవశ్యకతను వివరించారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకుడు జయశంకర్ మాట్లాడుతూ మట్టి నమూనాలను పొలాల్లో ఏ విధంగా తీయాలి, ల్యాబ్‌కు ఏ విధంగా పంపించాలనే అంశాలను తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి భూ సారాన్ని పెంచుకోవడానికి, చేయవలసిన పనులు, జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు శ్రీనివాస్ గౌడ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వాడలో గడప గడపకూ మన ప్రభుత్వం


కొవ్వాడలో మహిళలకు ప్రభుత్వం సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

- ఇంటింటికీ పర్యటించిన ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించేందుకు అధికారులతో కలసి చేపడుతున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు శనివారం కొవ్వాడలో నిర్వహించారు. గ్రామ సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, ఎంపీపీ పద్మజ, ఉపసర్పంచ్ తోటకూర శ్రీను, జాన్ ప్రభాకర్ తదితరులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామంలో తొలిరోజు పలు వీధుల్లో పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. వారి మద్దతును ముఖ్యమంత్రి జగన్‌కు, తనకు ఇవ్వాలని అభ్యర్థించారు. గ్రామస్తుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఎల్‌డీవో నారాయణమూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ముస్లింలకు అండగా ప్రభుత్వం

ముస్లిం మైనార్టీలకు ప్రభుత్వం అండగా ఉందని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని కొవ్వాడ గ్రామంలోని మసీదులో ఇఫ్తార్ విందులో కన్నబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. వక్ఫ్ బోర్డు జిల్లా డైరెక్టర్ కరీంబాషా తదితరులు పాల్గొన్నారు.